ఆంధ్రభూమి

సాహితి

# హారీ పాటర్ ఎక్కడ? మనం ఎక్కడ?

**జూ**లై ఇరవై తేదీ రాత్రి తొమ్మిదింటికి అమెరికాలో శాంతాక్లారా నగరంలో ఒక చోట కొన్ని వందల కుటుంబాలు పిల్లలతో కలిసి బారులు తీరి ఉన్నాయి. నేనూ మా అబ్బాయిని తీసుకొని బయల్దేరాను. అందరూ ఎప్పుడు తేదీ మారుతుందా అన్న ఉత్కంఠతో ఉన్నారు. ముఖ్యంగా పిల్లల ముఖంలో ఎంతో ఉద్వేగం కనిపించింది. చాలామంది సాయంత్రం ఐదు గంటల నుండే లైనులో ఉన్నారని తెలిసింది. టీవీ చానల్స్ వాళ్ళూ, వార్తా పత్రికల వాళ్ళు, ఫొటోగ్రాఫర్లు అందరూ ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. అందరి ఎదురుచూపూ ఒక్కటే! ఎప్పుడు తేదీ మారుతుందా అని! ఇదంతా చెబుతుంటే అక్కడ ఒక సినిమా రిలీజో లేదా ఒక పెద్ద మ్యూజిక్ ప్రోగ్రామో లేదా ఒక ఫుట్‌బాల్ గేమో అక్కడ జరుగుతుందనుకోవడం సహజం! కానీ అక్కడ అవేం జరగడంలేదు. ఏ ప్రముఖ వ్యక్తీ లేదా వ్యక్తులూ అక్కడికి రావడం లేదు. విపరీతమైన జనసందోహం.

ఇది జూలై ఇరవయ్యవ తేదీ రాత్రి తొమ్మిదింటికి జరిగిన సంఘటన. ఇది చదివాక అక్కడ ఏమయ్యుంటుందా అన్న ఆసక్తి ఎవరికైనా కలగక మానదు. తప్పని పరిస్థితిలో మా అబ్బాయి పోరు పడలేక వెళ్ళిన నాకు అక్కడి జనం, వారి ఆనందం, ఉత్సాహం చూస్తే ముచ్చటేసింది. ఆ ఆనందంలో నేనూ ఒక్కసారి మునిగితేలాను. అందరిలాగే నేనూ ఉద్వేగానికి లోనయ్యాను. ఇంతకీ అక్కడ అందరి ఆనందానికీ కార

ఏమిటంటే జూలై ఇరవై ఒకటవ తేదీ అర్ధరాత్రి పన్నెండు గంటలకి ఒక పుస్తకం రిలీజు అవుతుంది. అక్కడ చేరిన అందరూ ఆ పుస్తకం కొనుక్కోవడానికి హాజరయ్యారు, నాతో సహా! ఆ పుస్తకం మరేదో కాదు, యావత్ ప్రపంచంలోని పుస్తక ప్రియుల్నీ, ముఖ్యంగా చిన్నపిల్లల్నీ అందర్నీ మూకుమ్మడిగా మంత్రముగ్ధుల్ని చేసిన హారీపాటర్ చివరి పుస్తకం! ఇది జె.కె.రౌలింగు అనే రచయిత్రి రాసిన హారీపాటర్ సీరీస్‌లో ఆఖరి పుస్తకం! ప్రపంచ వ్యాప్తంగా కొన్ని వందల లక్షల కాపీలు అమ్ముడైన పుస్తకాలు ఈ హ్యారీ పాటర్ సీరీసు.

ప్రపంచంలోని ఏ మూలనున్న పిల్లాడికైనా ఇప్పుడు ఖచ్చితంగా తెలిసిన ఓ పుస్తక పాత్ర హారీ పాటర్! కేవలం ఒక్క పుస్తకానికింత క్రేజు ఈమధ్యకాలంలో ఎక్కడా చూడలేదు. పుస్తకాలు కొన్నాక పిల్లల ముఖాల్లో పరీక్షల్లో పాసు అయినంత సంబరం, ఆనందం కనిపించాయి. పిల్లల కళ్ళల్లో కాంతి తల్లిదండ్రుల నవ్వుల్లో పరావర్తనం చెందింది. అక్కడ అదొక సంబరంలా, జాతరలా ఉంది. కొంతమంది అయితే హారీ పాటర్ నవలలోని కొన్ని పాత్రల కాస్ట్యూమ్స్ ధరించి వచ్చారు. ఆ క్షణాల్లో అందరి నోటా ఒకే మాట, పుస్తకం ఎప్పుడు విడుదల అవుతుందా, ఇంటికెళ్ళి ఎప్పుడు చదువుతామా అనే! ఇదంతా చూసేకా అడపా దడపా రాసే అలవాటు ఉన్న నా మనసు ఎంతో ఉద్వేగానికి గురి అయ్యింది. మన తెలుగు పుస్తకాలకి కూడా ఇటువంటి మంచి రోజు వస్తుందా అన్న ఊహ నన్ను

ఉత్తేజపరచింది. ఒక్క తెలుగు పుస్తకాన్ని వందమంది చదివే సంస్కృతినుండి బయటపడి, వంద మందీ వంద పుస్తకాలు కొనే రోజు వస్తుందా అన్న ఆలోచన కలిగింది. అంతేకాదు, ఇలాంటి సంఘటన అంటే

ఒక పుస్తకాన్ని కొనుక్కోవడానికి బారులుతీరిన జనం ఎప్పుడైనా తెలుగు సాహితీ చరిత్రలో జరిగిందా అన్న ఇంకో సందేహం మొదలయ్యింది. ఆ సందేహానికి సమాధానం ప్రతీ తెలుగు సాహితీ మిత్రుడికీ తెలుసున్నదే! ఇంతకుముందు తెలుగులో అనేక పబ్లిషింగ్ కంపెనీలు ఉండేవి. చదివేవాళ్ళూ ఉండేవారు. రాసే కవులూ, రచయిత్రులూ పోటీపడి రాసేవారు. చదవడం సన్నగిల్లింది నేటి తరానికి. ఇంటర్నెట్, టీవీలు వచ్చేక చదవడం అనేది అరుదైన అలవాటుగా పరిణమించింది. వార్తా పత్రికలు తప్ప లేదా సినిమా పత్రికలు తప్ప చదవడం పట్ల ఎవ్వరికీ సుముఖత లేదు. ఉన్న ఒకటీ అరా పత్రికలూ అలాగే ఉన్నాయి. సర్క్యులేషన్ పెంచుకోవడానికి నానా అవస్థలు పడుతున్న రోజులివి. ఒకప్పుడు రచయితల చుట్టూ ప్రదక్షిణలు చేసే పబ్లిషింగ్ హౌసువారు కరువయ్యి తమ తమ రచనలను స్వీయ ముద్రణ చేసుకొని, తెలుసున్న పదిమందికీ పంచిపెట్టే కాలంలో ఉన్నాం. లేదా తమ తమ రచనలను కేవలం రచయితే తనకు తెలిసిన నలుగుర్నీ పోగు చేసి ఆ రచనలు పరిచయం చేసే వార్తగానే మిగులుతోంది. మరి కొంత మంది అయితే అందరి రచయితల కథలూ పోగుజేసి పుస్తకం అచ్చువేసి, ''మీ కథ వేసుకున్నాం కాబట్టి మాకు సహాయం రూపంలో డబ్బు ఇవ్వండి, పుస్తక ప్రచురణకి ఖర్చు అవుతుంది కదా?'' అంటూ ఇంకో రకమైన సాహిత్య సేవ చేసే నాథుళ్ళూ ఉన్నారు. ఏతావతా అన్యాయం జరిగేది రచయితకీ సాహిత్యానికీ- ఇంకాస్త ముందుకెళితే పాఠకులకీ!

దీనికంతటికీ కారణం ఏమిటి? వార్తా విప్లవం, సాంకేతిక విప్లవం అన్నీ తెలుగు భాషనీ, సాహిత్యాన్నీ వెనక్కి నెట్టేసాయని కొందరి అభిప్రాయం. అదేం కాదు. ఈ సాంకేతిక పురోగమనం అన్ని దేశాల్లోనూ

ఉంది. ముఖ్యంగా అమెరికాలో మరీ ఎక్కువగా ఉంది. ఎందుకంటే కంప్యూటర్ సాంకేతికాభివృద్ధి మొదలయ్యేది ఇక్కడే! పరికించి చూస్తే సమాధానం దొరికింది. అమెరికాలో పిల్లలు ఇంటర్నెట్టూ చూస్తారు, వీడియో గేములు ఆడుతారు, పుస్తకాలూ చదువుతారు. ఈ చదవడం అన్న అలవాటు అక్కడ పిల్లలకి ఒకటో తరగతినుండీ అలవాటు చేస్తారు. చిన్న చిన్న పుస్తకాలతో మొదలయ్యి అది కాస్తా తరగతులు పెరిగేకొద్దీ నవలలు చదివే స్థాయికి ఎదుగుతుంది. ప్రతీ విద్యార్థికి తమ తమ తరగతులను బట్టీ పుస్తక పఠనం, దానిపై చిన్న వ్యాసం, వారికొచ్చిన భాషలోనే, రాయించడం, ఇవన్నీ అక్కడ స్కూళ్ళల్లో జరుగుతాయి. పన్నెండో తరగతివరకూ అందరూ ఇంగ్లీషు లిటరేచరు (ఆంగ్ల సాహిత్యం) చదువుతారు. ఈ రకమైన చదవడం అనే అలవాటు సాహిత్యాసక్తి పైన పునాదులు వేస్తుంది. ఇది దాదాపు ఎనిమిదేళ్ళ విద్యార్థి దశలో జరుగుతుంది. మరి మన తెలుగునాడులో చదువులు ఎలా ఏడుస్తున్నాయో అందరికీ తెలుసున్నదే! తెలుగు మాట్లాడడమే పెద్ద కష్టంగా ఉన్న మనకి తెలుగు చదవడం ముఖ్యంగా తెలుగు సాహిత్యం చదవడం ఇదంతా ఒక అందని స్వప్నంలా తయారయ్యింది. దీనికి కారణం కొంత ప్రజలది, మిగతా పాపం పాలించేవారిది. ఎవరి వంతు సాయం వారు యథావిధిగా చేస్తున్నారు. తెలుగులోనూ అద్భుతమైన పిల్లల కథలూ ఉన్నాయి. పంచతంత్రం, భోజరాజ కథలు, తెనాలి రామకృష్ణ కథలు, మర్యాద రామన్న కథలంటూ మనకీ ఉన్నాయి. కానీ మనం మన పిల్లలకి చెప్పం. ఎందుకంటే అవి మనకే సరిగ్గా తెలియవు కనుక. ఇదీ మన పరిస్థితి! ఇందులోంచి బయటపడతామా అన్నది ఆ పరమాత్ముడికే ఎరుక! కేవలం ఒక్క చదివే అలవాటు, పుస్తకం ఏదైనా సరే, ఇంతమంది తల్లిదండ్రులందర్నీ ఆ

షాపుకి రప్పించింది. పుస్తక పఠనం ఒక వ్యసనం కావాలి. అది చిన్నప్పుడే ఉగ్గుపాలలో రంగరించి పిల్ల లకి అలవాటు చేయాలి. ఇది అందరి బాధ్యతానూ! పరాయి భాషలు నేర్చుకోవడం తప్పుకాదు, కానీ మనదైన భాషని కాలదన్ని మన సాహిత్యాన్ని మనమే నొక్కేసే స్థితి తెచ్చుకోవడం క్షమించరాని నేరం. "పుస్తకంలో ప్రతీ పేజీ చదివినప్పుడల్లా చదవడం అనే ఆస్తి ఇచ్చిన మా అమ్మా, నాన్నలకి నేనెప్పుడూ ఋణపడి ఉంటాను" అని అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత రచయిత సోమర్‌సెట్ మాం! చిన్నప్పుడైన అల వాట్లు మానుకోవడం అంత సులభం కాదు. దాదాపు ఇటువంటి సంఘటనే నా చిన్నప్పుడు ఆంధ్రాలో జరిగింది. ఆంధ్రభూమిలో తులసీదళం సీరియల్ ప్రచురించేటప్పుడు, ఎప్పుడు వారపత్రిక వస్తుందా అని ఎంతో ఆత్రంగా ఎదురుచూసేవాళ్ళం. షాపువాడ్ని పుస్తకం రాగానే ఒక కాపీ దాచమని ముందుగానే డబ్బులు ఇచ్చిన సంఘటనలూ ఉన్నాయి. ఇటువంటి శక్తి కేవలం ఒక్క పుస్తకానికీ, దాన్ని రచించే రచ యితకి మాత్రమే ఉంది. ఆకట్టుకొనే విధంగా రాసే రచయితలూ తగ్గుతున్నారు, అచ్చువేసే నాథుళ్ళూ కరువయ్యారు. ప్రపంచంలో అన్ని భాషల్లోనూ సాహిత్యం వ్యాపకం స్థాయి నుంచి వ్యాపార స్థాయికి ఎదిగింది, ఒక్క తెలుగులో తప్ప! రంధ్రాలు వెతుకుతాము కానీ పూరించడానికి ప్రయత్నం చేయని దౌర్భాగ్య స్థితి మనది! హారీ పాటర్ పుస్తకం కోసం జనాలు క్యూలు కట్టి వెంపర్లాడే విధంగా మన తెలుగు సాహిత్యమూ ఆ దిశగా ఎదగాలన్న ఆశ, మన అందరి కలగా మారాలి! అది ఫలిస్తుందో లేదో కాలమే చెప్పాలి.

- సాయి బ్రహ్మానందం గొర్తి

07/21/2007